# పేరడీ

**దైనందిన జీవితంతో సతమత మయ్యే ఒక సాహిత్యాభిమాని తన స్నేహితుడికి ఉత్తరం రాస్తే ఇలా ఉంటుందేమో!**

*డియర్ త్యాగీ!*

ఒక మంచి పుస్తకం చదువుతూంటేనే, మంచి గేయాలు మననం ఉంటూండగానే, టేప్‌రికార్డరులో అర్థరాత్రి ప్రసాంత సమయంలో "మల్లీశ్వరి" సినిమా పాటలు వింటూండగానే, పున్నమి చంద్రుడు నిశీధిని తన చల్లని కాంతితో పరిపాలిస్తుండగానే,

నువ్వు జ్ఞాపకానికి వస్తావు.

అయితే, పొలవాడి కాలింగ్ బజర్‌తో లేచి, గీజర్ ఆన్ చేసి, సైరన్ మోతతో స్నానం చేసి, విమానా ప్రమాదాలు, కుటిల రాజకీయ వార్తలూ, టిఫిన్ చేసి, ఫ్యాక్టరీ సైరన్‌కి అటెండెన్స్‌లో సంతకం చేసి, యంత్రాలమధ్య యాంత్రికంగా పనిచేసుకుంటూ, తుప్పుపట్టిన రేకుల శబ్దాలు వింటూ, కేంటీన్‌లో "కాఫీ" లాంటిది సేవిస్తూ, మధ్యాహ్నం హడావిడిగా నాలుగు మెతుకులు మేసి, సాయంత్రం పిల్లలకు పాఠాలు చెప్పుకుని, రోగాలూ, రొష్టులూ లేకుండా మూడ్ బాగుంటే, పెళ్ళాన్ని సినిమాకి తీసికెళ్ళి, హమ్మబాబోయ్... ప్రొద్దుటే లేవాలి.. అనుకుంటూ గురక పెట్టేసే నాబోటి వాళ్ళని వ్రాయమంటే ఏం రాస్తారు?

కానీ "స్పందన" వుంది చూశావూ? అది మాత్రం వూరుకోదు. అసలు నిజమైన హృదయాన్ని (అంటే ఏమిటి?) అది తట్టి లేపుతుంది. అసలే హృదయాలూ గట్రా అందమైన ఆడపిల్లలివి కావని, వాళ్ళకి హృదయమే వుండదని, పోతే దరిమిలా ముళ్ళపూడి వారన్నట్టు "వాళ్ళ వాళ్ళ బొమ్మల్తో గుడి కొట్టి, దణ్ణాలు మాత్రం దేవుడికి పెడుతూ అందమైన అబ్బాయిల్ని లేడికళ్ళతో చూస్తూ, ఒకళ్ళ హృదయాల్ని ఒకళ్ళకిచ్చి పుచ్చుకునే వాళ్ళవి!" అని అభిప్రాయ పడటమే నిజమైన హృదయం!

అందుకే నాబోటివాడు స్పందనలో అందరూ నిద్రపోతున్న ప్రశాంత సమయంలో కొండంత ఆవేశం... గోరంత సాహిత్యంలో నీకు ఏదేనా రాద్దాం... అని మొదలు పెడతానా... మొదట పానకంలో పుడకలా... మా ఆవిడ... అర్ధ రాత్రి ఏమిటా రాతలు? పడుకోండి. కూటికా... గుడ్డకా... అని పడుకుంటుంది.

దానికేం తెలుసు? ఇలాంటి అర్ధరాత్రి రాసిన రాతే ఎప్పుడో... ఒకప్పుడు (రాత బాగుంటే)... ఈ గ్స్తనీ నది నీళ్ళ జలుబు చేస్తే... ఏ కృష్ణా నది తీరానికివస్తే... సేద తీర్చి, ఓ పూట భోజనం పెడుతుందని, ఓ జాకెట్ ముక్క పెడుతుందనీ...?

అర్థరాత్రి దోమలు కుట్టి నన్ను లేపినప్పుడు నేను బాధపడను. కారణం? నిద్ర పట్టని ఆరాత్రి ఏ కృష్ణశాస్త్రినో ఆవాహన చేసి కూర్చుంటే... ముళ్ళపూడితోనో, మల్లాదితోనో తెల్లారిపోతుంది.

చివరిగా రెండు ముక్కలు. ఇందులోనే (పురి) కొసమెరుపు వుంటుంది. పోపు :- ఇదేమిటి? అని ఆశ్చర్యపడకు. రచనా వ్యాసంగాన్ని వంటతో పోలిస్తే, ఆవంట (కాని)కి రుచి తెచ్చేది పోపు. అంటే చక్కని చిక్కని మాటల సాహిత్యం. కొందరు పోపు పెడితే కమ్మటి సువాసన "గుభాళిస్తుంది." మరికొందరు నాలాంటి వాళ్ళు పోపు పెడితే "గుభాళిస్తుంది!'

**ఇంతకంటే ఏమీ రాయలేని, రాయని భాస్కరుణ్ణి.**

**ఇట్లు**

**నీ భాస్కర్**

# పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

పాలగ్లాసు పట్టుకొని శోభనం గదిలోకి అడుగు పెట్టింది పాలరాతిబొమ్మ సుహాసిని. సిగ్గుతో బరువెక్కి వాలిపోయిన కళ్ళను అతి మెల్లగా ఎత్తి చూసింది. ఎదురుగా, చిరునవ్వు నవ్వుతున్న భర్త సుభాష్.

"రా హాసినీ" అని మృదువుగా పిలిచాడు సుభాష్. హంసలా నడుస్తూ సుభాష్ దగ్గరకు వెళ్ళింది. "మంచం మీద కూర్చో," అన్నాడు. కూర్చొంది సుహాసిని సుభాష్ ఆమె పక్కనే కూర్చొని కొన్ని ప్రశ్నలు వేసాడు. అన్నిటికి సుహాసిని తీయనైన కంఠంతో జవాబులు చెప్పింది. ఆమెలో బెరుకుతనం, సిగ్గు, బిడియం పోయాయి.

ఎంతో సరదాగా మాట్లాడుతోంది సుభాష్‌తో. "నీకు కలం స్నేహం చేసే అలవాటు ఉందా," అన్నాడు. "ఓ! ఉంది, ఒక మంచి అనుభవం కూడా ఎదురైంది" అంది సుహాసిని. "చెప్పు," అన్నాడు కుతూహలంగా సుభాష్. సుహాసిని హుషారుగా చెప్పసాగింది, "నేను మధు అనే పెన్ ఫ్రెండ్‌తో స్నేహం చేసేదాన్ని, అతను ఒకసారి నా ఫొటో పంపమన్నాడు. తరువాత తన ఫొటో పంపుతానన్నాడు. మంచి ఫ్రెండ్ కదా అని అలానే పంపాను. తరువాత పిచ్చిపిచ్చిగా అసభ్యమైన కవిత ఒకటి రాసి పంపాడు. నాకు చిర్రెత్తుకొచ్చింది. వెంటనే "ఇదుగోండి మొన్న తమాషాకి మా పనిమనిషి కూతురు ఫొటో నా దగ్గరుంటే మీకు పంపాను. ఇప్పుడు నిజంగానే నా ఫొటో పంపుతున్నా"నని మా పిన్ని కూతురు బాగా లావు, అందుకే పాపం అందరూ దాన్ని రోడ్డురోలర్ అని పిలుస్తారు. దాని ఫొటో పంపాను. మళ్ళీ లెటర్ రాస్తే ఒట్టు". సుహాసిని అనుభవం విన్న సుభాష్ ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేకుండా పోయినట్లయింది. కారణం ఆ మధు ఈ సుభాష్ ఒక్కడే! అందుకే ఆమెని కమాట్లాడనీయకుండానే అల్లుకుపోయాడు!!.

**—కాజ హనిత**

25-14-10

నరసింహారావుపేట,

ఏలూరు-534 006

*స్రవంతి నెం: 21లో ఈ శీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ జి. అనంతశయనం పెట్టిన పేరు: మాషాపుడు రండి*